# విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించండి

**ఏఈ సుధాకర్**



డిజిటల్ పేమెంట్ కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యుత్ అధికారులు, వినియోగదారులు

దేవరుప్పుల, అక్టోబర్ 18: విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించడం వల్ల పారదర్శకతతో పాటు, భద్రత, సమయం ఆదా అవుతుందని విద్యుత్ శాఖ మండల అధికారి సుధాకర్ అన్నారు. మండలంలోని కామారెడ్డిగూడెం, సీతారాంపురం, దేవరుప్పుల గ్రామాల్లో బుధవారం డిజిటల్ పేమెంట్స్‌పై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ గోపాల్‌రావు ఆదేశాల మేరకు స్థానిక విద్యుత్ ఉద్యోగులతో కలిసి గ్రామాల్లో డిజిటల్ పేమెంట్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ బిల్లులను ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, బిల్ డెస్క్, టీ వ్యాలెట్ ద్వారా చెల్లించవచ్చన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా బిల్లుల చెల్లింపునకు సంబంధిత ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ఓపెన్ చేసి అందులో ఉన్న ఎలక్ట్రిసిటీ బిల్లు యాప్‌లో మీ జిల్లా, ఈఆర్‌వో పేరు, విద్యుత్ బిల్లుపై ఉన్న సర్వీసు నెంబర్ ఎంటర్ చేస్తే బిల్లు నగదు చెల్లింపు కనిపిస్తుందని, వెంటనే పేమెంట్ చేసే సదుపాయం ఉంటుందన్నారు. ఈ చెల్లింపుల వల్ల బిల్ కలెక్టర్ కోసం ఎదురు చూసే పని తప్పుతుందన్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా ఫోన్ ద్వారా చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి డిజిటల్ పేమెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ ఉదయ్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మమ్మద్ జావెద్, లైన్‌మన్ చారి, జేఎల్‌ఎంలు రాజేశ్వర్, రజినీకాంత్, నాగరాజు, శ్రీనివాస్, రహమాన్, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్


## అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి • ఎంపీపీ సుదర్శన్**

జఫర్‌గఢ్, అక్టోబర్ 18: అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రడపాక సుదర్శన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పని చేసే ప్రభుత్వం, పార్టీకి ప్రజలు అండగా ఉండి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. దసరా ఉత్సవాలతో పాటు ఎన్నికలు ఉన్నందున అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తమ సహకారాన్ని అందించాలని ఎస్సై మహేందర్ కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, వైస్ ఎంపీపీ కడారి కనకయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పెదమడూరు బతుకమ్మ వేడుకలకు మంత్రికి ఆహ్వానం

దేవరుప్పుల, అక్టోబర్ 18 : పెదమడూరులో 7వ రోజే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం ఆనవాయితీ. శుక్రవారం జరుపుకుంటున్న ఈ పండుగకు రావాలని గ్రామస్తులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆహ్వానించారు. మంత్రి స్వగ్రామం పర్వతగిరిలో బుధవారం ఆయనను కలిసిన గ్రామస్తులు శాలువాతో సత్కరించి ఆహ్వానం పలికారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, ఆర్బీఎస్ గ్రామ కోఆర్డినేటర్ ఆకవరం పెద్దారెడ్డి, ఎంపీటీసీ పానుగంటి గిరి, ఉప సర్పంచ్ మానుపాటి వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు నల్ల ఉమేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు రాములు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, యూత్ నాయకులు పానుగంటి కృష్ణ, చంద్రగిరి సంపత్ పాల్గొన్నారు.



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సన్మానిస్తున్న పెదమడూరు గ్రామస్తులు



సూరారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

జఫర్‌గఢ్, అక్టోబర్ 18 : ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ కోరారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఏసీపీ బుధవారం పరిశీలించారు. మండలంలోని తమ్మడపల్లి జీ, సూరారం, ఓబులాపూర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



సేవాలాల్ మహాసభలో అభివాదం చేస్తున్న గిరిజన నాయకులు

## సేవాలాల్ సేన మండల కమిటీ ఎన్నిక

దేవరుప్పుల, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో బుధవారం సేవాలాల్ సేన మండల మహాసభ నిర్వహించారు. సేవాలాల్ సేన మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బిక్కునాయక్, కోకన్వీనర్లుగా తరుణ్‌నాయక్, రమేశ్ నాయక్, యాకూబ్ నాయక్, ప్రచార కార్యదర్శిగా రాకేశ్ నాయక్, సహాయ కార్యదర్శులుగా భాస్కర్, స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధాకర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ మైదాన ప్రాంత గిరిజనుల కోసం జిల్లా కేంద్రంలో మినీ ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర త్రిసభ్య కమిటీ సభ్యులు చిన్నబాబు నాయక్, ప్రేమ్‌చంద్ నాయక్, కళాకారుడు ఎస్సీ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు మహేందర్, రాజు, రంగయ్య, అనిల చౌహాన్, రమేశ్, సుమన్, ప్రకాశ్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కడవెండిలో ఆయిల్‌పామ్ క్షేత్ర సందర్శనలో రైతులు

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభం

దేవరుప్పుల, అక్టోబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుందని, ఈ పంట సాగు వల్ల రైతుకు లాభదాయకంగా ఉంటుందని ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కడవెండిలో రైతు చెన్నూరు సత్యనారాయణ ఆయిల్‌పామ్ క్షేత్రంలో బుధవారం ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు, నీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగు, పూల గుత్తుల తొలగింపుపై ఔత్సాహిక రైతులకు వివరించారు. అలాగే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక, ఏఈవో సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు

మరిపెడ, అక్టోబర్ 18 :శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు ముమ్మర తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఎస్సై దూలం పవన్ ఆధ్వర్యంలో ప్రతి వాహనం తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా మద్యం, నగదు రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు

దేవరుప్పుల, అక్టోబర్ 18: మండలంలో పలు గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. పెదమడూరులో దుర్గామాత ఉత్సవ సమితి, కడవెండిలో సంస్కార్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రులు నిర్వహిస్తున్నారు. దుర్గామాతను చంద్రఘుంట దుర్గాభవానీ అవతారంలో అలంకరించి పూజలు చేశారు. ఈ మండపాల్లో కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెదమడూరులో దుబ్బ రాజశేఖర్ నేతృత్వంలో అన్నదానం చేశారు.

### మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

పాలకుర్తి : మండలంలో దేవీశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శాంతినగర్, గుడివాడ, గౌడ కాలనీ పలు వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దుర్గామాతను దర్శించుకొని పూజలు చేశారు.



దేవరుప్పల : పెదమడూరులో దుర్గామాత



పాలకుర్తి : మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



సోమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## సోమయ్య స్మృతి తీరని లోటు

పాలకుర్తి, అక్టోబర్18 : మండల కేంద్రంలోని కమ్మగాని సోమయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న అన్నారు. బుధవారం సోమయ్య సంస్మరణ సభ నిర్వహించారు. సభలో సోమన్న మాట్లాడుతూ అనేక విషయాల్లో సోమయ్య ప్రజలను చైతన్యం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కరించకుండా ప్రజల మధ్య విద్వేషాలను పెంచుతుందని ఆరోపించారు. ధరలు పెంచి ప్రజలపై భారం వేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, నాయకులు సోమ సత్యం, సోమ అశోక్ కుమార్, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, గట్ల మల్లారెడ్డి, పులి ఏలేంద్ర తదితరులు పాల్గొన్నారు.